# మంజీ ప్రవాళం

చీకట్లో గదిలో పడుకుని వుంది లత. ఏకాకిగా ఏ హృదయమూ స్పందించని ఏకాంతంలో ఎవరూ చూడని నరకంలో చిక్కుకుని వుంది లత.

అతను మెరపులాగా వచ్చాడు. అటు దక్షిణానిలం వీచే దారినుండీ దయాసరస్సులలో విహరించే రాజ హంసనెక్కి నక్షత్ర కిరణం మీదుగా జారుతూ వచ్చాడు.

అతను పాట పాడాడు. పాటకి చీకటి చీకాకుపడి నల్లగా కోప్పడింది.

అతను పాట పాడాడు. చీకటిని చెరిపివేస్తూ వేయి పువ్వులతావి వింతగా కమ్ముకుంది.

అతను పాట పాడాడు. జాలిగా తియ్యగా లత గుండెలో కోర్కెలా హాయిలా తెరతెరల్లాగ కదలింది.

ఆమె కళ్ళు తెరచింది. అతను నవ్వాడు. అతను వెళ్ళిపోయాడు. అతను మళ్ళీ మరో రోజున వచ్చాడు. "లతా" అని పిలిచాడు. అతని గొంతులో మాధురీ మందాకిని జలజలించింది.

"ఇంకోసారి పాడు" అంది లత రెప్పల్ని కొంచెం ఎత్తి. నల్లని పొడుగాటి ఆమె తలవెంట్రుకలు చీకట్లో తరంగాలలా కదలుతున్నాయి.

అతను పాడాడు. చీకటి చీకాకు పడింది. గుడ్లగూబలు దిగులుగా ఏడ్చాయి. అతను వెళ్ళిపోయాడు.

అతను మళ్ళీ ఇంకోరోజున వచ్చాడు. లత పెదవులమీద సన్నని చిరునవ్వు చెదిరింది. ఆప్యాయంగా అడిగింది. "ఒక్క పాట పాడవూ?"

పాడాడు. లత కళ్ళల్లో నీళ్ళు, నీళ్ళలోంచి చావును దాటిన వెలుగు. అతను నిట్టూర్చాడు.

కౌన్నాళ్ళకి మాలతీ సౌరభం వీచిన రాత్రి –

"స్వామీ" అంది లత.

అతను మాట్లాడలేదు.

"కవీ" అంది లత.

అతను మాట్లాడలేదు.

"ప్రియా" అంది లత.

అతను పలికాడు. నక్షత్రాలు మెరిశాయి. వెన్నెల కురిసింది. అతని చేయి ఆలంబనగా లత లేచి నిలుచుంది. అతని వొళ్ళో వాలింది. కిటికీ అవతల మందారం ఎర్రగా నవ్వి తల పక్కకు తిప్పుకుంది.

వకుళ వృక్షం విరిసిన రాత్రి –

"ప్రియా" అంది లత.

"లతా" అన్నాడతను.

"మిమ్మల్ని వదలలేను."

జవాబుగా ఆమె ఫాలాన్ని ముద్దాడాడు అతను.

"ఎక్కడనుంచి వచ్చారు."

"మంచు పర్వతాల అంచున దయాసరస్సుకి దక్షిణాన మంత్ర విహంగాలు మసలేచోటున రంగు రంగుల చెట్ల నీడలలో పాడుకుంటూ ఉంటాను."

"అక్కడికి దగ్గరగా మాయలోకం వుంది. భయంలేదా" అంది లత. అతను నిట్టూర్చాడు.

మొగలిచెట్టు మొదటిరేకు తొడిగిన రాత్రి—

"ప్రియా" అంది లత,

"ప్రియతమా" అన్నా డతను.

"ఏం ఆలోచిస్తున్నారు ?"

అతను నిట్టూర్చాడు. అతను వెనక్కి చూశాడు. అతని వెనకాల మబ్బులు ....

"పాట పాడవూ" అతని వొడిలో తల పెట్టుకుని అడిగింది లత.

అతను పాడాడు—లత పులకరించింది. పరవశించింది.

అరమోడ్పు కన్నులతో అతన్ని గుండెలకి హత్తుకుంది. అతను బరువుగా నిట్టూర్చాడు.

అతను వస్తున్నాడు. లత చిరుగుపట్టింది, మొదటి పువ్వు పూసింది.

అతను వస్తున్నాడు. అతనితోటి మబ్బులు వస్తున్నాయి. మబ్బుల వెనుక రాక్షసులు దాక్కున్నారు.

నక్షత్రం రాలిపోయిన రాత్రి -

అతను వచ్చాడు. అతని గుండెమీద రాక్షసుల మొదటి గోటి గీత - ఎర్రని చార !

"నన్ను కాపాడగలవా ?" అన్నా డతను.

"ఓ" అంది లత,

"అయితే నీ దగ్గరున్న మణిప్రవాళం ఇవ్వు."

"నా దగ్గర లేదు."

"అయితే-?"

"ఇంకోటి ఇస్తాను."

ఆమె ఏదో ఇచ్చింది. రక్తపుచార కనబడలేదు. అతను నవ్వాడు. ఎప్పటిలాగే వెన్నెల....

కొన్నాళ్ళు గడిచాయి. అతను వచ్చాడు. ఈ సారి అతని గుండె మీద రెండు ఎర్రని చారలు. అతను కొంచెం వడలాడు.

"నన్ను కాపాడగలవా " అన్నాడు.

"ఓ" అంది లత.

"అయితే మణిప్రవాళం ఇవ్వు."

"లేదు."

"మరి-?"

"ఇంకోటి యిస్తాను."

ఆమె ఏమిటో ఇచ్చింది. రక్తపు చారలు కనపడలేదు.

అతను నవ్వాడు. కాని ఆ నవ్వులో నీరసం వుంది.

లత రెండవ పువ్వు తొడిగింది. అతనికోసం చూసింది. రాత్రీ పగలూ 'ప్రియా' అని పిలిచింది. ఆ పిలుపుకి ఆకాశపు అంచున ఒక చెల్లు రాలి పడింది.

అతను వచ్చాడు. ఈసారి గుండె అంతా రక్తం. ఎర్రని మడుగు లాగా వుంది. అతని వెనుక నల్లని మబ్బులు. నల్లని మబ్బుల వెనుక రాక్షసుల వికటాట్టహాసాలు.

"నన్ను బ్రతికించు. నన్ను చంపేస్తున్నారు." అన్నాడతను.

"ఏం చెయ్యను నేను?" ఏడ్చింది లత మూడవపువ్వుతో సహా.

"మణిప్రవాళం యివ్వు."

"లేదు."

"ఉంది. నాకు తెలుసును."

"దానిమీద నాకు అధికారం లేదు."

"అయితేనేం - మళ్ళీ తిరిగి యిచ్చేస్తానుగా."

లత ఊగిపోయింది. బాధ పడింది. విహ్వలించింది. కళ్ళుతెరచి జాలిగా యిలా అంది: "నా పెద్దల అభిమానం నావాళ్ళ అనురాగం - అన్నీ పోతాయి. నా వాళ్ళు నాకు కాకుండా పోతారు...."

"వాళ్ళందరీ్ని వదిలెయ్యి."

"వదలలేను."

"అయితే మరి....?"

"ఇంకోటి యిస్తాను."

"లాభంలేదు."

ఈసారి అతని కళ్ళల్లో చీకటి. అతని పెదవుల పైన చీకటి. నిర్దయలాంటి చావులాంటి చీకటి.

"వెళ్ళిరానా?" అన్నాడు, అతని స్వరం సన్నగా మెలికలు తిరిగి చీకట్లో గిలగిలలాడింది, గుండెనుండి కారే రక్తాలు పిండుకుంటూ అతను వెళ్ళిపోయాడు. అతని వెనుక మబ్బు లరచుకుంటూ, రాక్షసు లరచుకుంటూ వెళ్ళిపోయారు.

లత ఏడుస్తూ కూలబడింది-మూర్ఛపోయింది.

మళ్ళీ అతను రాలేదు.

లత మళ్ళీ పూయలేదు.

అతని జాడ తెలియదు.

చీకటి లతని ముసుగులా మూసుకుంది.

అతను మళ్ళీ రాలేదు.

అతను మళ్ళీ పిలవలేదు.

అతని పాట అర్ధరాత్రి మబ్బులలోంచి జాలిగా –

ఆమె మూలుగు పాతాళ కుహరంలోంచి బాధగా –

పువ్వులు రాలిపోయాయి. మంచు దట్టంగా పడి మనసులూ, ఆకులూ మూసుకుపోయాయి.

బావురుమనే నిశ్శబ్దం అంతటా....

దేవతలు ఏడుస్తోన్న వర్షం. మనుష్యులు కాలుతూన్న వాసన.

అతన్ని వెతకడానికి వెళ్ళినవారికి దారిపొడుగునా అతని గుండె రక్తపు మరకలే కనుపించాయి. కాని అతను మాత్రం కనపడలేదు.

ఆమెను చూడడానికి వెళ్ళిన వారికి గదిలో ఆమె కనపడలేదు. కిటికీ చీకటి తప్ప.

ఇది ప్రళయం – అంది రాలిపోయిన పువ్వు.

ఇది విలయం – అంది జారిపోయిన చుక్క.

పెట్టెలోపల – గదిలో మూలగా పెట్టెలోపల్లోపల–మణిప్రవాళం మెరుస్తోంది. ఫక్కున నవ్వింది. ఇలా అంది:

"నా శక్తి అనంతమైనది. నేను కరుణనీ, ప్రేమనీ సౌందర్యాన్నీ నశింప చేస్తాను. దైవీయశక్తుల్ని ఓడిస్తాను. ఈ జగత్తు నాకు బానిస. అవునా?"

అవును అన్నాయి మబ్బులు.

అవును అన్నారు రాక్షసులు.

అవును అన్నాయి చెట్లూ, చెట్లమీద పిట్టలూ భయంగా.

అవును అన్నాయి పువ్వులు ఏడుస్తూ.

ఒక్కసారిగా నిశ్శబ్దం. కఠిన శాసనంలాగా నిశ్శబ్దం. యుగాల దాకా మళ్ళీ ఏ హృదయమూ పలకలేదు–పలవరించలేదు.

(సాహితి, 1963)